

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
శనివారం 10 జనవరి 2026



# కాపాడండి బాబోయ్

## ఊపిరి పీల్చుకోలేక ప్రాణాలుపోతున్నాయి



- చిన్నపిల్లలు, వయో వృద్ధులు, ఆసుపత్రి పాలవుతున్నాం... కాపాడండి
- చర్మ సమస్యలు శ్వాసకోస వ్యాధులు ఊపిరితిత్తులు సమస్యలతో బెంబేలెత్తిపోతున్న నైనవరం నివాసులు
- ఎవడొస్తే నాకేంటి డబ్బు పడేస్తే అధికారులు సైతం సలాం కొట్టాల్సిందే అంటున్న రైస్‌మిల్ ఓనర్....
- రాత్రి ఆరు దాటితే భయంతో వణికిపోతున్న రైస్ మిల్ బాధితులు




వివరాలు 2లో...

# జగన్ రెడ్డి ఒక చరిత్ర హీనుడు..

## చరిత్ర సృష్టించే నాయకుడు సీఎం చంద్రబాబు

ప్రపంచంలో నోటి వెంట నిజం మాట్లాడలేని నేత పులివెందుల ఎమ్మెల్యే వైఎస్.జగన్

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుని అటకెక్కించింది జగన్ ప్రభుత్వమే

విజయవాడ ఎంపీకేశినేని శివనాథ్

వివరాలు 2 లో



తెలుగు వారి సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీక

# కొండపల్లి బొమ్మలు



## ప్రపంచానికి తెలుగువారిచ్చిన విలువైన బహుమతి కొండపల్లి బొమ్మలు

## యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రాచీన చరిత్ర, సహజసిద్ధమైన రంగులు,
పర్యావరణహితమైన తయారీ విధానం అంతర్జాతీయ స్థాయిలో కొండపల్లి
హస్తకళల పేరు ప్రఖ్యాతలకు ముఖ్య కారణమని యూరోపియన్ అంబాసిడర్
హెర్వే డెల్ఫిన్ తెలిపారు. తెలుగువారి కళా వైభవానికి నిలువుటద్దం, ప్రపంచ
ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి హస్తకళలను శుక్రవారం కొండపల్లిలోని ఏపీ టూ
రిజం శాఖ నిర్వహిస్తున్న కొండపల్లి ఎక్స్పీరియన్స్ సెంటర్ ను యూరోపియన్
యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.
లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియాతో కలిసి పరిశీలించారు. స్థానికుల
సంక్రాంతి ముగ్గులతో సాంప్రదాయ స్వాగతంతో అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్
పర్యటన ప్రారంభమైంది... సాంప్రదాయ హారతి, పూల దండలతో రాయబా
రిని తిలకందిద్ది స్వాగతించగా, వీధి మొత్తం సప్తవర్ణ ముగ్గులతో అలంకరిం
చబడిన పండుగ వాతావరణంగా మారింది. ఈ ప్రాంతమంతా సంక్రాంతి

2

గంజాయి అమ్మకాలను నియంత్రించేందుకు

# పకడ్బందీగా చర్యలు చేపట్టాలి



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలో గంజాయి అమ్మకాలను నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి నార్కోటిక్స్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా కూడా ఎట్టి పరిస్థితులను గంజాయి గానీ మాదకద్రవ్యాలు గాని అమ్మకాలు జరగరాదన్నారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచి గంజాయి అమ్మకాలను నియంత్రించాలన్నారు. ముఖ్యంగా చేపలు, రొయ్యలు చెరువుల దగ్గర పనిచేసే బీహార్, బెంగాలు తదితర రాష్ట్రాల వలస కూలీల జాబితా సేకరించి వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. అలాగే వ్యవసాయ కూలీలుగా పనిచేసే ఇతర రాష్ట్రాల వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల వద్ద కూడా పనిచేసే వలస కూలీల

మిగతా 2లో

# విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



## ఎమ్మెల్యే డా.మండలి బుద్ధప్రసాద్

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్ లో 15వ ఫైనాన్స్ కమీషన్ హెల్త్ గ్రాంట్స్ నిధులు రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, చల్లపల్లి మండలంలో ఐదు ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి రూ.1.80కోట్లు, అవనిగడ్డ నియోజకవర్గంలో 14 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.5.04కోట్లు మం జూరైనట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న 15 భవనాలను పూర్తిచేసేందుకు రూ.1.36కోట్లు మంజూరు చేశారన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారని, నారాయణరావునగర్ కాలనీలో పేదలకు ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా పేదప్రజలకు వైద్యసౌకర్యాలు అందిస్తోందని, నగదు చెల్లించి వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్దఎత్తున సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కింద రూ.7కోట్లు మంజూరుచేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయనిధి మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ఐదేళ్ల విధ్వంసం కారణంగా ఎన్నో సమస్యలు ఉన్నాయనీ, ఆర్థిక వెసులుబాటు ఆధారంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. నారాయణరావునగర్లో రహదారుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. సాస్కి నిధులు తీసుకువచ్చి రహదారుల అభివృద్ధి చేసున్నట్లు చెప్పారు. చల్లపల్లి మండలంలో పల్లెపందుగలో రూ.1.07 కోట్లతో 1.8కిలోమీటర్ల మేర 18 సిమెంటు రహదారులను నిర్మించినట్లు తెలిపారు. పల్లెపండుగ రెండవ విడతలో రూ.67 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.55 కోట్లతో 503 పనులు చేపట్టేందుకు ప్రతి పాదనలు పంపామనీ, నిధుల మంజూరుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ కార్పోరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, సొసైటీ చైర్మన్ బొండలపాటి వీరబాబు, డిప్యూటీ తాసిల్దార్ శ్రీలత,డీఈ పగడాల సురేష్బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ, ఈవో పివి. మాధవేంద్రరావు, వార్డుసభ్యులు అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్, నేతలు షేక్ నబీఘోరీ, రావి చిట్టి, అడపా రాంబాబు, షేక్ నసీమ్ గోరి మిరియాల జితేంద్ర, రావి రాజు, ప్రెస్ పూర్ణ, వరదా హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించిన గురుమూర్తి



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** ప్రగతి పథంలో మన పామర్రు కార్యక్రమంలో భాగంగా తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. పామర్రు శాసనసభ్యులు మరల కుమార్ రాజా అందుబాటులో లేకపోవడంతో రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పామర్రు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం ఆయన లేకపోవడంతో ఆయన సూచనల మేరకు నిర్వహించినట్లు ఈ సందర్భంగా గురుమూర్తి తెలిపారు. "ప్రగతి పథంలో మన పామర్రు ప్రజల సమస్యల పరిష్కార వేదిక" పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా అభ్యర్థనలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కారాలు కల్పించడమే లక్ష్యంగా కుమార్ రాజా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ ప్రజాదర్బార్ లో వివిధ సమస్యలకు సంబంధించి 40 దరఖాస్తులు అందగా వాటిలో 16 సమస్యలకు అక్కడికక్కడే తక్షణ పరిష్కారాలు అందించారు. మిగతా ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని గురుమూర్తి తెలిపారు. సమస్యలను ప్రధానంగా తోట్లవల్లూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, హాస్టల్ గా నిర్మించిన భవనము శిథిలావస్థలో ఉన్న కారణంగా దానిని ఎస్సీ, ఎస్టీల క్రీడా ప్రాంగణంగా గుర్తించి అభివృద్ధి చేయాలని, ఎస్సీ కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న అంగన్ వాడి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని, ఎస్సీ కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటుచేసి పాత స్తంభాలను తొలగించడం మరిచారని, వాటిని తక్షణమే తొలగించి గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలని, ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న సైడ్ తూములను రోడ్డు ఇరువైపులా అమర్చాలని స్థానికులు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కుసుమకుమారి, ఎండిఓ రవికాంత్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ్, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్ శనివారపు కృష్ణ సుమన్, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సివిఏపి బృందం సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు



**కొండపల్లి మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కొండపల్లిలో శుక్రవారం ప్రజదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. మొత్తం 241 మంది అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా ఇళ్లస్థలాలు, ఇళ్లపట్టాలను ఇవ్వాలని, రహదారులను అభివృద్ధి చేయాలని, కొండపల్లి మున్సిపాలిటీలో మార్కెట్ సెంటర్లో మరుగుదొడ్ల నిర్మాణం కొరకు, హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు, కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల అభివృద్ధి కొరకు, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయుట గురించి, ఎన్టిటిపిఎస్ కాలుష్య నివారణ కొరకు, కిల్లా ద్దులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి, పైపులైన్ల ఏర్పాటు నీటి కుళాయిలు, వీధిదీపాల ఏర్పాటు డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం, పోలీసు శాఖకు సంబంధించి ఇంకా పలు సమస్యల గురించి ప్రజలు వినతులు సమర్పించారు. ఆయా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వెంటనే పరిష్కారం అయ్యే వాటిని గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అభివృద్ధికి సంబంధించి నిధుల సౌలభ్యతను బట్టి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజదర్బారు నిర్వహణ ప్రజాస్వామ్య పాలనకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా వారంలో ఒక రోజు ఒక్కో ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించి, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. ఒకవేళ వారి సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలు కూడా వారికి తెలియజేయాలని అన్నారు. ఇళ్లస్థలాలకు సంబంధించి ఇప్పటికే కొండపల్లి మున్సిపాలిటీలో చాలామందికి ఇళ్లస్థలాలను పంపిణీ చేశామని, ఇంకా అర్హత కల వారు ఉంటే, సమగ్రంగా విచారించి,ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదిలా ఉండగా సొసైటీ ఉద్యోగులు కూడా వారి సమస్యలను పరిష్కరించాలని, తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, జంపాల సీతారామయ్య ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## పలు గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వానపాముల, కొర్నిపాడు, రావులపాడు, జమీదింటకుర్రు గ్రామాలలో శుక్రవారం రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దార్ బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా అర్జీలను అందించి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస పుస్తకాలను పూర్తిస్థాయిలో రైతులందరికీ అందిస్తున్నామన్నారు. నూతనంగా అందిస్తున్న పాసు పుస్తకాలకు సంబంధించి ఎటువంటి తేడాలను గమనించినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామాలలో రెవిన్యూ క్లినిక్ పేరిట గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల ద్వారా రైతుల నుండి అందిన అర్జీలను సకాలంలో పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో డిప్యూటీ తహసిల్దార్ కొడాలి ఏసుపాదం, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ సుందరరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సనకా శ్రీనివాసరావులతో పాటు స్థానిక విఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## రాజగోపాలరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కైలే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు గ్రామంలో తమ్మా రాజగోపాలరెడ్డి సతీమణి కొద్దిరోజుల క్రితం మరణించగా పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్తో పాటు వైసీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ బాబు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీసాయి విద్యా నికేతన్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. హరిదాసులు, జంగమ్మదేవార, సోది అమ్మాయి, ఫాన్సీ డ్రెస్



లలో విద్యార్థులందరూ పాల్గొని ఎంతో సందడి చేశారు. భోగిమంటలు, బాలబాలికల సంక్రాంతి నృత్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీసాయి విద్యా నికేతన్ కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ జంక్షన్ పరిధిలో విద్యుత్ కోత

### ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మత్తులు.. 5 గ్రామాల్లో నిలవనున్న సరఫరా

**హనుమాన్ జంక్షన్, జనవరి 9, మేజర్ న్యూస్ :** 33/11 కేవీ హనుమాన్ జంక్షన్ విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మత్తుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం (జనవరి 10) ఉదయం 8.00 గంటల నుండి 11.00 గంటల వరకు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మరమ్మత్తుల కారణంగా బాపులపాడు, పెరికీడు, శేరి నరసన్న పాలెం, ముందదుగు, సీతారాంపురం గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. కావునపై గ్రామాలకు చెందిన గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులందరూ ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గుడివాడ, జి.బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోషకాహార పంపిణీ




చల్లపల్లి, మేజర్ న్యూస్ : లయన్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి పురస్కరించుకుని జిల్లా గవర్నర్ వివిఎస్. ఆంజనేయులు ఆదేశాను సారం హంగర్ సర్వీస్ వీక్ కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోషకాహార పంపిణీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. చల్లపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్, రవీంద్రభారతి, ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు క్లబ్ ప్రతినిధులు పోషకాహారాన్ని అందించారు. గతంలో నేత్ర పరీక్షలు చేసి కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన విద్యార్థులకు క్లబ్ తరపున ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముమ్మనేని నాని, వరదా హరిగోపాల్, జోన్ఛైర్మన్ మోపిదేవి వెంకటేశ్వరరావు, నర్రా సాయిబాబు, ఉప్పల సాంబశివరావు, ఏఎన్ఆర్కే ప్రసాద్, ఎం.వి. కృష్ణారావు, అంబటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుడ్లవల్లేరులో విద్యుత్ సరఫరా వుండదు



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : నేడు 10.01.26 శనివారం ఉదయం 09.00 గంటల నుండి 1.00 గంటల వరకు సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా గుడ్లవల్లేరు మండలం మొత్తం విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, కనుక ప్రజలందరూ గమనించి సహకరించగలరని జి.బి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గుడివాడ కోరారు.

## విజయవంతంగా ముగిసిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్



విజయవాడ మేజర్ న్యూస్ : బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ 2025, తన అద్భుతమైన ఎడిషన్ తో ముగిసింది. గురుగ్రామ్, జైపూర్, కోల్కతాల వ్యాప్తంగా ఫ్యాషన్ అనుభవాలకు కొత్త ప్రమాణాన్ని నిర్ధారించింది. ఫ్యాషన్లో ముందు ముందు రాబోయే పరిణామాలకు నాంది పలికే 'ద వన్ ఎండ్ ఓన్లీ (ఒకే ఒక్కటి)'ని సృష్టించిన ఈ టూర్ మూడు వినూత్నమైన కథనాలను సమర్పించింది. ఇవి ఫ్యాషన్ను అనుభవించే, వేడుక చేసుకునే, కల్పన చేసుకునే సరిహద్దులను మరింతగా పెంచాయి. బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఫ్యాషన్ను ఏ విధంగా ప్రగతిపథంలో నడుపుతాయో ప్రతి పట్టణం తన కళ్ళతో తాను స్వయంగా చూసింది. రియల్-టైమ్ లో టెక్నాలజీ, దుస్తులు పరస్పరం మమేకమయ్యే భవిష్యత్తులోకి గురుగ్రామ్ ఫ్యాషన్ ను చొప్పించింది. హై-ఆక్టేన్ మోటార్ స్పోర్ట్స్ ఈస్తటిక్స్ తో కలిసి ఫ్యాషన్ ను జైపూర్ ఫాస్ట్ లేన్ లో వడిగా సాగేట్లు చేసింది. కళల పట్ల సాధారణంగా ఉంటూ వచ్చిన ఉద్దేశ్యాలను సవాలు చేస్తూ, వాటిని ఒక సాహసోపేతమైన, అధునాతన రూపంలోకి కోల్కతా మార్చింది.

## మొక్కుబడి గా ఉపాధి గ్రామసభలు



మొవ్వ మేజర్ న్యూస్: గ్రామాల్లో ఉపాధి హామీ పథకంపై జరిగిన గ్రామసభలు అధికారులు మొక్కుబడిగా ముగించారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షులు శీలం నారాయణ రావు. ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గతంలో గ్రామ సభలు వారం రోజులు పాటు నిర్వహించే వారని ప్రస్తుతం జరిగిన సభలు రాష్ట్రంలో ఒకేరోజు అన్ని గ్రామాల్లో నిర్వహించడం అధికారులకు కత్తి మీద సాముగా తయారైతూతూ మంత్రంగా మొక్కుబడి ముగించడం చాలా దారుణం. దేశంలో పేదలకు ఆర్థికంగా ఎదుగుదలకు అవకాశం ఉన్న పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, దీనికి రాష్ట్రంలో ఉన్న అధికార,ప్రతిపక్ష పార్టీ లు తానా అంటే తందానా గా తయారై పేదల బతుకులు నాశనం చేయటానికి పూనుకున్నాయని, గత 20 సంవత్సరాలుగా అమలు జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ భవిష్యత్తులో ఉద్యమాలు చేయటానికి సిద్ధంగా ఉండాలని ఎ పి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తుందని శీలం నారాయణరావు పేర్కొన్నారు.

## పులిగడ్డ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



అవనిగడ్డ మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పులిగడ్డ లో వేంచేసి ఉన్న అలివేలుమంగా రాజ్యలక్ష్మి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు అవనిగడ్డ కు చెందిన విశ్రాంత పాధ్యాయులు కొమ్మినేని ఉమామహేశ్వరరావు రూ. 10116లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ద్వారా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో మండలి భవనారాయణ అర్చకులు ధన్వంతరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన - జనవాణిలో సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే మండలి

## ఊపిరితిత్తుల వ్యాధి బాధితునికి దాత సహాయం సమకూర్చిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్




కోడూరు మేజర్ న్యూస్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం జనసేన – జనవాణి. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో జనసేనాని పవన్ కళ్యాణ్ చేపట్టిన ఈ కార్యక్రమం దృష్టికి కోడూరు గ్రామానికి చెందిన ఊపిరితిత్తుల వ్యాధి 'సిరోసిస్' బాధితుడు బండారి మణికంఠ గత ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యను అతని కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. ఈ సమస్యను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిష్కరించారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న మణికంఠ గత కొంతకాలంగా ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వినియోగిస్తున్నాడు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయాల్లో మణికంఠకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం కోరుతూ జనవాణి ద్వారా సమర్పించిన అర్జీని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిష్కరించారు. గురువారం మణికంఠ కోసం జనరేటర్ కొనుగోలు చేసేందుకు చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ సహకారంతో రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని మణికంఠ కుటుంబ సభ్యులకు అందజేశారు. మణికంఠ గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి దాత సహకారంతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరిష్కారం చూపడంతో మణికంఠ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు, దాత డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతులకు తమ హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం ద్వారా తమ సమస్య పరిష్కారం కావడం పట్ల మణికంఠ కుటుంబ సభ్యులు సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు.

## దివ్యాంగులకు బహుమతుల ప్రదానం



గన్నవరం, జనవరి 9, మేజర్ న్యూస్ : సమాజంలో దివ్యాంగులు ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించి ప్రతిభతో ముందుకు సాగగలరని మరోసారి చాటుతూ, ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని దివ్యాంగుల కోసం నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వికలాంగుల చైర్మన్ నారాయణస్వామి, ఉమ్మడి కృష్ణాజిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి) ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. దివ్యాంగులు శారీరక పరిమితులను జయించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడాలని వారు ఆకాంక్షించారు. కృష్ణాజిల్లా తరపున మచిలీపట్నం నుండి గులాం హైదర్, బంటుమిల్లి నుండి నాగలక్ష్మి, గన్నవరం నుండి బూదాటి శ్రీనివాసరావు బహుమతులు స్వీకరించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధికార ప్రతినిధి పచ్చ గల భాస్కర్ పాల్గొని, దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సాధికారతపై అవగాహన కల్పించారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం దివ్యాంగుల విద్య, స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో 25వ రోజు గోపూజా మహోత్సవం



చల్లపల్లి మేజర్ న్యూస్ : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలోని గీతామందిరంలో 25వ రోజు గోపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచీ స్వామివారికి విశేష అర్చన, విష్ణుసహస్ర నామ పారాయణ, తిరుప్పావైపాశుర ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా గోపూజ సేవ ఏర్పాటు చేయగా, భక్తులు.. మహిళలు పెద్దఎత్తున పాల్గొనగా, మామిళ్లపల్లి శివరామకృష్ణ పూజలు నిర్వహించారు. గోదాకృష్ణ భక్తబృందం వరదా నాగమణి, కొల్లిపర నళిని, నాగకుమారి, ప్రమీల, భారతి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి వరదా హరిగోపాల్, కొల్లిపర సాంబశివరావు, తమ్మన సతీష్ కుమార్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు..

గన్నవరం, జనవరి 9, మేజర్ న్యూస్ : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. శనివారం ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న ఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, స్టేట్ స్కూల్, గొల్లనపల్లి, బిబి గూడెం, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యంతో పాటు ఆదాయం



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 09 : వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ( ప్రకృతి వ్యవసాయం విభాగం ) మండల సమాఖ్య, పశు సంవర్థక శాఖ, విద్య, వైద్య ఆరోగ్య శాఖ ల సంయుక్త సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ కృష్ణా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. పార్థసారథి ఆదేశాల మేరకు మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం శుక్రవారం జరిగింది. గుడ్లవల్లేరు మండల వ్యవసాయ అధికారి ఎల్. సునీల్ మాట్లాడుతూ పెరటి తోటి పెంపకం ద్వారా కుటుంబ ఆరోగ్యానికి మెరుగు పరుచుకోవడమే కాకుండా ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించి, పెరటి తోట పెంపకం, రైతులు ఎ-గ్రేడ్ మోడల్, మినుము లో అంతర పంటల ద్వారా ఆదాయన్ని, భూమి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని, ప్రకృతి వ్యవసాయం మరింత ముందుకు తీసుకువెళ్ళాలని మండల ఇంచార్జ్ ట్రైనింగ్ ఎన్ఎఫ్ఏ గంగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏ ఓ ఎల్. సునీల్, ఎపిఎమ్ ఎమ్. పాండు రంగ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి 2 వేణుగోపాలరావు, మండల పశుసంవర్ధక అధికారి చింతయ్య, మండల ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది, వివిఎలు, సీసీలు, విఓఏలు, విఓఓబిలు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో సంప్రదాయ క్రీడల నిర్వహణ భేష్

### మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం - విజేతలకు బహుమతుల ప్రదానం



ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో సాంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించడం భేష్ అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు రావి ఫణి యూత్ ఆధ్వర్యంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో మూడు రోజులు పాటు ఇక్కడ రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పురుషుల విభాగంలో ఏ1-ఇబ్రహీంపట్నం, మహిళల విభాగంలో విజయనగరం జట్లు విజయం సాధించాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో 8 జట్లు, మహిళల విభాగంలో 4 జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన జట్లుకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచలి శ్రీకాంత్, గురువారం రాత్రి క్రీడామైదానం వేదిక వద్ద బహుమతులు అందజేశారు. క్రీడాకారులతో కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక దేహధారుడ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఏడాది పోటీలు నిర్వహిస్తున్న రావి ఫణిని అభినందించారు. సంక్రాంతి నేపథ్యంలో అందరూ ఇటువంటి క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అవనిగడ్డలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



అవనిగడ్డ మేజర్ న్యూస్: అవనిగడ్డ లోని ఎస్విఎల్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల ముందుగానే సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఓ టీవీ ఛానల్, ఎస్ వి ఎల్ కళాశాలల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ వేడుకల్లో సినీనటి సునయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో కళాశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో మార్మోగింది. విద్యార్థులతో కలిసి ఆమె మాట్లాడి సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ యువత సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని రంగురంగుల ముగ్గులు, భోగి మంటల ప్రతీకాత్మక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పాటలతో వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఓ టీవీ ఛానల్ స్టేట్ బ్యూరో చీఫ్ గరికపాటి సాంబశివరావులు విద్యార్థినీ విద్యార్థులతో మమేకమై కర్ర సాము తదితర పోటీలలో విద్యార్థులను ఉత్సాహపరిచారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, 99 టీవీ ఛానల్ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అవనిగడ్డ ఎస్విఎల్ కళాశాలలో జరిగిన ఈ సంక్రాంతి సంబరాలు దివిసీమ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## పాత ఎడ్లంక ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



అవనిగడ్డ మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పాతఎడ్లంక యూపీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భోగిమంటల మధ్య సంప్రదాయ దుస్తులతో ఆడపిల్లలు ఓణీ లంగాలతో, మగ పిల్లలు పంచకట్టులతో గాలిపటాలతో,సంక్రాంతి పాటలు పాడుతూ భోగి మంట చుట్టూ నృత్యాలు చేశారు. పాఠశాలలో ముగ్గులతో గొబ్బెమ్మలతో అలంకరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను గూర్చితెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉత్సాహంగాపాల్గొన్నారు ప్రధానోపాధ్యాయులు జానపద గాయకులు సూరగరామకృష్ణ ప్రసాద్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రోహిత్ ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శివలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో సరదాల సందళ్ళు సంక్రాంతి సంబరాలు





కృష్ణలంక, మేజర్ న్యూస్ : స్థానిక శ్రీచైతన్య కృష్ణలంక శాఖలో తెలుగుదనాన్ని లోకమంతాచాటుతూ, మన సంప్రదాయాన్ని విశ్వమంతా .. తెలుపుతూ సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనమైన పండుగ సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, సంక్రాంతి పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ కొత్త ఆశలు, అభ్యుదయం, సంస్కృతీ సంప్రదాయాల పునరుత్తేజం పల్లెజీవనం, కుటుంబ సభ్యుల కలయిక పంటల పండగ – సంక్రాంతి అంటే నూతన క్రాంతి భోగిమంటలు, చిన్న పిల్లలకు భోగి పళ్ళు, పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతు భోగభాగ్యాలను అనుభవించే రోజు భోగిపండుగ అన్నారు. ఇంటి ముందు కళానైపుణ్యాలను ప్రదర్శించేలా రంగవల్లులు, దానాలు, బొమ్మల కొలువులు, దేవతార్చనలు, పితృదేవతలకు పూజలు, దేవతలు, తల్లిదండ్రులు సాటి మనుషులు, ప్రకృతి మనుషులు, ప్రకృతిపట్ల కృతజ్ఞత ప్రేమను ప్రకటించే పండుగల్లో సంక్రాంతి ముఖ్యమైనదని అన్నారు. గాలిపటాలు ఎగరవేయడం, కోడిపందేలు, హరిదాసుల కీర్తనలు, వ్యవసాయానికి తోడ్పడే జీవాలను పూజించడం కమ్మని కనుమ పండుగనాడు రకరకాల పిండి వంటలతో ఆనందగా గడుపుతారని సంక్రాంతి పండుగ గొప్పతనాన్ని ఉద్ఘాటించారు.

విద్యార్థులు ఉత్సాహంగా హరిదాసులు వేషధారణ, సంప్రదాయ వస్త్రా లతో ముత్యప్రదర్శనలు, ప్రధానో పాధ్యాయులు చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోశారు. భోగి మంటలు, రంగవల్లులు, గొబ్బిళ్ళు, పొంగళ్ళు బొమ్మల కొలువు, కోడిపందేలు పలు కార్యక్రమాల్లో పాల్గొని సరదాల సంక్రాంతి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ జి.యం.యం మురళి కృష్ణ, ఆర్. ఐ.జె రాజేష్ బాబు, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు.

## వసతి గృహాలలో సంకల్పం కార్యక్రమం.



అవనిగడ్డ మేజర్ న్యూస్ : ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రేరణతో వందరోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారుల సూచనల మేరకు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక వెనుకబడిన తరగతుల, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలోని 9,10 తరగతి విద్యార్థులకు స్టడీ టేబుల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇన్చార్జి తాసిల్దార్ ఏ. శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం. మరియా దేవి, ఈవోపీఆర్డీలు కె. పద్మావతి, డి. చంద్రశేఖర్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. స్టడీ టేబుల్స్ ద్వారా ప్రతి విద్యార్థి సులువుగా చదవచ్చునని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక బోధకులను స్టడీ టేబుల్స్ కిట్లను అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డబ్ల్యూ ఓ పర్వీన్ సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల అధికారులు పెదసింగు.బాబురావు, కే. వెంకటేశ్వరరావు, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు ఆవుల భాస్కరరావు, వెనకబడిన తరగతుల బాలికల వసతి గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వసతి గృహం అధికారి సిహెచ్. దుర్గారాణి పాల్గొన్నారు.

## అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



విజయవాడ, మేజర్ న్యూస్: మహారాష్ట్రలోని షిర్డీలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. విజయవాడ గాంధీనగర్ లోని ఎన్జీవో హోంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎ.విద్యాసాగర్.. జాతీయ ప్రతినిధులు, రాష్ట్ర ఎన్జీజీవో సంఘ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ 60 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సమాఖ్య దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 80 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు నేతృత్వం వహిస్తోందన్నారు. జాతీయ కౌన్సిల్ సమావేశాలకు అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 1,200 మంది ప్రతినిధులు హాజరవుతారని, వివిధ దేశాల నుంచి కూడా ఆత్మీయ అతిథులుగా వివిధ సమాఖ్యలకు సంబంధించిన ప్రతినిధులు కూడా హాజరవుతారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 55 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిందని తెలిపారు. స్థానిక మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగే మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సిపిఎస్ అంశం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వివిధ రాష్ట్రాల్లో ఉన్న వేతన సవరణ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల మీద చర్చ, అంతర్జాతీయంగా జరుగుతున్న వివిధ పరిణామాలపై సమావేశాల్లో చర్చించి, పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ నేతృత్వంలో ఈ జాతీయ సమావేశాల నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలోనే మహిళా ప్రతినిధులకు ప్రత్యేకమైన సెషన్స్ జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న విషయంపై ఒక రోజంతా చర్చ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి కూడా ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు ఏపీ ఎన్‌జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఏఐఎస్జీఈఎఫ్ సబ్ కమిటీ మహిళా కార్యదర్శి రాజ్యలక్ష్మి, ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు జగదీశ్వరరావు, భారతీ ప్రసాద్, జానకి, శివప్రసాద్, సుబ్బారెడ్డి, క్యాపిటల్ సిటీ అధ్యక్షులు నాగభూషణం, సరస్వతి, ఎన్జీవో సంఘ ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, విజయవాడ నగర శాఖ అధ్యక్షకార్యదర్శులు సివిఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి త్యాగరాజస్వామి



అవనిగడ్డ, మేజర్ న్యూస్: తెలుగు సంగీత ప్రాధాన్యమైన భాష అని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి త్యాగరాజస్వామి అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక త్యాగరాజ స్వామి మందిరంలో సద్గురు త్యాగరాజ స్వామి వర్ధంతి, మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.త్యాగరాజ మందిర కార్యవర్గం, దివిసీమ సాహితీ సమితి, తెలుగు సావిడి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషలో తెలుగు కృతులతో కూడిన కర్ణాటక సంగీతంలోని కీర్తనలు ఆలపించని భారతీయ గాయకులు లేరంటే అతిశయోక్తి లేదన్నారు. దివిసీమ సంగీత పరంపర వర్ధిల్లిన ప్రాంతం అన్నారు. ఆకట్టుకున్న లలిత కళాష్టావధానము ఈ సందర్భంగా ప్రముఖ నటులు, గాయకులు, అవధాని డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహించిన లలిత కళాష్టావధానం అద్యంతము విశేషంగా ఆకట్టుకుంది. సంచాలకులు అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పర్యవేక్షణలో నిషిద్ధాక్షరిని డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, సమస్యను డాక్టర్ ఎం.కృష్ణ కిషోర్, దత్తపదిని డాక్టర్ అగ్నిహోత్రం పవన్, వర్ణన డాక్టర్ అన్నపరెడ్డి వీర కుమారి, హరికథను జల్లూరు రమాకుమారి, నాటక సంగీతం దీవి ఝాన్సీ, అప్రస్తుత ప్రసంగం డాక్టర్ పూషడపు సుబ్బారావు నిర్వర్తించి అవధానాన్ని అత్యంతరం ఆసక్తిభరితంగా కొనసాగించారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు మత్తి శ్రీనివాసరావు, మత్తి వెంకటేశ్వరరావు, కొండవీటి ఈశ్వరరావు, లతా మోహన్, సారంగపాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే వసంత పరామర్శ



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీలో మృతుల కుటుంబాలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం పరామర్శించారు. కొండపల్లి మున్సిపాలిటీకి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులు పాలపర్తి నాగేశ్వరరావు కుమార్తె నాగ భవాని అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆమె సంస్మరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు నాగభవాని చిత్రపటం వద్ద పుష్పములు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె తల్లిదండ్రులను పరామర్శించి, ఆమె అనారోగ్య పరిస్థితిపై వాకబు చేసి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. చిన్న వయసులోనే నాగభవానీ మృతిచెందడం పట్ల చలించిపోయారు. శోకసంద్రంలో ఉన్న ఆమె తల్లిదండ్రులను ఓదార్చారు. దిలా ఉండగా కొండపల్లి ఏబీఎం పేటలో అటవీశాఖ గార్డు సిరాపురం సుధాకర్ మాతృమూర్తి గ్రేస్ విమల మృతిచెందగా ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు జాబితాలను రూపొందించాలనే లక్ష్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమగ్రమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇం టెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ప్రక్రియను శుక్రవారం సాయంత్రం మచిలీపట్నం నగరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్ర స్థాయిలో పలు గృహాలను సందర్శించి మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ నగరంలోని ఒకటవ వార్డు, సోమలీల మౌనిక గ్రూప్ హౌసింగ్ కాలనీ, అదేవిధంగా 46వ డివిజన్, శ్రీనివాస నగర్ కాలనీలో కొందరి ఓటర్ల గృహాలను సందర్శించి ఓటర్ల ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ చేసే క్రమంలో తలెత్తే సమస్యలను ఎన్నికల విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట బందరు ఇంచార్జ్ ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి పోతురాజు, బూత్ స్థాయి అధికారి రత్నారావు, ప్రణతి, డిప్యూటీ తహసిల్దార్ హఫీజ, మచిలీపట్నం నగర సహాయ కమిషనరు గోపాలరావు తదితరులు ఉన్నారు.

## అట్టహాసంగా హెయిర్ స్టైల్ పోటీలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బ్లోసెం బిజి బడ్స్ సంక్రాంతి సంబరాల్లో నిర్వహించిన హెయిర్ స్టైల్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. అతి తక్కువ సమయంలో నిర్వహించిన ఈ హెయిర్ స్టైల్ పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. చిన్నారుల నుంచి మహిళల వరకు అందరూ ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. దాదాపుగా 30 మంది మహిళలకు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు లాంగ్ హెయిర్, ట్రెడిషన్ హెయిర్, హెయిర్ స్టైయిల్ విభాగాల్లో జరిగాయి. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ మొక్తిక బొటిక్ నిర్వాహకురాలు, మేకప్‌ఉమెన్ రూప పుప్పాల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని లాంగ్ హెయిర్ విభాగంలో బి. గుణ సంధ్య గెలుపొందారు. అలాగే ద్వితీయ బహుమతిని ట్రెడిషనల్ హెయిర్ స్టైల్‌లో కె. హన్విత గెలుపొందారు. అదేవిధంగా తృతీయ బహుమతిని ట్రెడిషనల్ విభాగంలో జయలక్ష్మి గెలుపొందారు. టి ప్రేమ్ నాథ్ తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బ్లోసెం బిజి బడ్స్ నిర్వాహకురాలు ఎ కన్య మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను ప్రతి ఏటా నిర్వహిస్తామని, ఈ ఏడాది ప్రత్యేకమన్నారు. ఈ ఏడాది మహిళలకు హెయిర్ స్టైల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా విజేతలకు బహుతులను స్పాన్సర్ చేసిన హైదర్ సిల్వర్స్ అధినేత ముజాహెద్ హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా వ్యవహరించిన రూపకు కన్య మెమెంటోతో సత్కరించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మొవ్వ మేజర్ న్యూస్:** ఏపీ సిపిడిసిఎల్ మచిలీపట్నం డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. గోవిందరావు ఆదేశాల మేరకు మొవ్వ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33/11కె.వి లైన్ల మరమ్మతులు కారణంగా మొవ్వ, మొవ్వ పాలెం, వేములమడ, గూడపాడు, నరసన్నపాలెం గ్రామాలకు ఈనెల 10వ తేదీ రెండవ శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయబడుతుందని మొవ్వ విద్యుత్ సబ్ స్టేషన్ ఏ.ఇ రమేష్ బాబు తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా రమేష్ బాబు కోరారు.

# మకర సంక్రాంతి సందర్భంగా బీబీజీ గ్రూప్ బంపర్ ఆఫర్..






**విజయవాడ, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, రియల్ ఎస్టేట్ రంగంలోనే మొట్టమొదటిసారిగా బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి) ఒక చారిత్రక ఆఫర్‌ను ప్రకటించింది. కేవలం జనవరి నెలకు మాత్రమే పరిమితమైన ఈ ఆఫర్ ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు కొత్త నిర్వచనం ఇవ్వనుంది. "ఉచిత రిజిస్ట్రేషన్ నుండి ఉచిత ప్లాట్ వరకు" అనే పేరుతో చేపట్టిన ఈ ప్రచారం, కచ్చితమైన పొదుపుతో పాటు అద్భుతమైన బహుమతిని కూడా అందిస్తోంది. ఈ ప్రాంతంలో పండుగ వేళ లభించే అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ ప్రత్యేక సంక్రాంతిలో భాగంగా, జనవరి 2026లో బిబిజి ప్లాట్‌లో పెట్టుబడి పెట్టే ప్రతి కొనుగోలుదారుడికి ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం లభిస్తుంది. ఈ వేడుకను మరో స్థాయికి తీసుకెళ్ళా, బిబిజి ఒక లక్కీ డ్రాను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో ఒక విజేతకు ఉచిత ప్లాట్ లభిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలోనే మునుపెన్నడూ లేని అపూర్వమైన ఆఫర్‌గా ఇది నిలుస్తోంది. మరిన్ని వివరాల కోసం కస్టమర్లు 2026 జనవరి 9, 10, 11 తేదీలలో విజయవాడలోని క్రెడాయ్ ప్రాపర్టీ షో, ఎ కన్వెన్షన్ సెంటర్‌లోని స్టాల్ నెం.5ని సందర్శించవచ్చు. ఆఫర్ గురించి మరిన్ని వివరాలను పొందడానికి కస్టమర్లు 040 –69032244కు కాల్ చేయవచ్చు లేదా వారి వెబ్‌సైట్: https://amaravati.__›india.com ని సందర్శించవచ్చు. ఈ ఆఫర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న అమరావతి ప్రాంతంలోని మూడు ఎంపిక చేసిన బిబిజి ప్రాజెక్టులకు వర్తిస్తుంది. బెవర్లీ హిల్స్ కాజా (కాజా), ఫార్చ్యూన్ ఎంపైర్ సిటీ (చలివేంద్రపాలెం), క్యాపిటల్ వెస్ట్ (కొండపావులూరు). అధిక వృద్ధి ఉన్న ప్రాంతాలలో వ్యూహాత్మకంగా ఉన్న ఈ ప్రాజెక్టులు, పక్కా ప్రణాళికతో, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, జీవనశైలికి అవసరమైన వసతులతో రూపొందాయి. ఇవి సొంత ఇంటి అవసరాలకు, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఎంతో అనువైనవి. అమరావతి ప్రధాన పెట్టుబడి కేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో, బిబిజి అందిస్తున్న ఈ పండుగ ఆఫర్ కొనుగోలుదారులకు రెండు రకాల ప్రయోజనాలను చేకూరుస్తోంది. ఉచిత రిజిస్ట్రేషన్ ద్వారా తక్షణ నగదు పొదుపు, లక్కీ డ్రా ద్వారా ఉచిత ప్లాట్ గెలుచుకునే అవకాశం. ఈ మూడు ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టే మొదటి 100 మంది కొనుగోలుదారుల నుండి లక్కీ డ్రా విజేతను ఎంపిక చేస్తారు. ఇది ఈ ఆఫర్‌కు మరింత ప్రాధాన్యతను, ప్రత్యేకతను చేకూరుస్తోంది. ఈ ఆఫర్ ప్రారంభం గురించి బీబీజీ ఇండియా సీఎండీ ఎం.వి. మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. "సంక్రాంతి అంటేనే కొత్త ఆరంభాలకు, సిరిసంపదలకు నిదర్శనం. ఈ పండుగ ఆఫర్ ద్వారా మా కస్టమర్లకు కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా, నమ్మకాన్ని, విలువైన లాభాలను అందించాలని భావిస్తున్నాం. రియల్ ఎస్టేట్ పెట్టుబడిని పారదర్శకంగా, ప్రతి ఒక్కరికీ లాభదాయకంగా మార్చాలన్నదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. 2006లో స్థాపించబడిన బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి), అత్యుత్తమ ప్రణాళికతో కూడిన కమ్యూనిటీలను, ప్రీమియం ల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అభివృద్ధి చేయడంలో అవార్డులు పొందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రాండ్. గత 19 ఏళ్లలో బిబిజి 23 క్లస్టర్లలో 300కు పైగా ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. 24 జాతీయ అవార్డులను అందుకున్న ఈ సంస్థ, 1.8 లక్షల మందికి పైగా సంతృప్తికరమైన కస్టమర్ల నమ్మకాన్ని పొందింది. తద్వారా తెలుగు రాష్ట్రాలలో అత్యంత కస్టమర్ సెంట్రిక్ రియల్ ఎస్టేట్ బ్రాండ్‌లలో ఒకటిగా నిలిచింది.

## భూవివాదాలు లేకుండా స్పష్టమైన భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం రూరల్ మండలం కొత్త పూడి, పొట్లపాలెం గ్రామాలలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ భూమి మీ హక్కు ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రైతులకి సంబంధించి 525 పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు అనగా శుక్రవారం మచిలీపట్నం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రీ సర్వే పూర్తయిన గ్రామాలు కొత్తపూడి, పొట్లపాలెం గ్రామాల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా "మీ భూమి – మీ హక్కు మీ భూమి మీ హక్కు అనే భావనతో, ప్రభుత్వ రాజముద్ర అధికారిక ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని రైతులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం సాధారణంగా భూమి రికార్డులు, హక్కులకు సంబంధించిన ప్రభుత్వ ఉపక్రమంలో భాగం పట్టాదారు పాస్ పుస్తకం అనేది భూమి యాజమాన్యాన్ని రుజువు చేసే ఒక ముఖ్యమైన శాశ్వత డాక్యుమెంట్. ప్రభుత్వ ముద్రతో కూడిన ఈ పుస్తకాలను భూమి యజమానులకు పంపిణీ చేయడం వలన:

1. భూమి హక్కుల భద్రత: రైతులు, భూమి యజమానుల హక్కులు సురక్షితం చేయబడతాయి. 2. పారదర్శకత: భూమి రికార్డులు అధికారికం, స్పష్టంగా ఉంటాయి. 3. చట్టబద్ధత: భూమి లెక్కలు నవీకరించబడి, వ్యతిరేక దావాల నుండి రక్షణ లభిస్తుంది. 4. ప్రభుత్వ ఉపక్రమాల ప్రాతినిధ్యం: శాసనసభ్యులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన, ప్రభుత్వం యొక్క జనాభా–స్నేహపూర్వక కార్యక్రమాలకు మద్దతు, దృశ్యమానత లభిస్తుంది. ఇది భూమి యజమానులకు వారి హక్కులను ధృవీకరించే అధికారిక డాక్యుమెంట్లను పంపిణీ చేయడానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ తలారి సోమశేఖర్, లంకె శేషగిరి, పరింకాయల శివాజీ, వాలిశెట్టి తిరుమలరావు, మేక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ పగడ్బందీగా చేపట్టాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ పగడ్బందీగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావుతో కలిసి ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బూత్ స్థాయి అధికారులు తదితర ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ చేయాలని, అదేవిధంగా 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2002 సంవత్సరంలో ఉన్న ఓటర్లతో వెరిఫై చేసి సంతాన ప్రొజెనీ మ్యాపింగ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఓటరు, ఒక నియోజకవర్గంలో మాత్రమే ఓటు కలిగి ఉండేలా చూడాలన్నారు. వ్యక్తి మరణించినా, ఇతర ప్రాంతాలకు వలసపోయినా, ఓటర్ల వివరాలను పరిశీలించి వారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించే విధంగా బిఎల్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి పోలింగ్ బూత్ కు బిఎల్ఏను తప్పనిసరిగా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ నిర్వహించే సమయంలో ప్రతి బిఎల్వో ఎన్యుమరేషన్ ఫారంను ప్రతి ఓటర్కు తప్పనిసరిగా అందజేయాలని, అదేవిధంగా నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ నిర్వహించు సమయంలో మొదటి అప్పీల్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్, రెండవ అప్పీల్ అధికారిగా ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఉంటారని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు పోతురాజు(ఇంచార్జ్), జి బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, పలు జిల్లా అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నంలో ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి సంబంధించి ఆయన విగ్రహము,కన్వెన్షన్ హాలు, వైజ్ఞానిక ప్రదర్శనశాల, డిజిటల్ గ్రంథాలయము, విద్యా, ఆరోగ్య, సాంస్కృతిక విభాగాలను, యూనియన్ బ్యాంకు పరి పరిపాలన భవనం నిర్మించాల్సి ఉందన్నారు.

ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గత నెల 31వ తేదీన సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసి అందజేయాలన్నారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేస్తున్న భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక ట్రస్ట్ విధివిధానాలను కూడా పకడ్బందీగా రూపొందించాలన్నారు. ప్రతిపాదిత 2 ఎకరాల స్థలంలో 1.50 ఎకరాలు ట్రస్ట్ పేరిట, 50 సెంట్లు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా పేరిట అలినేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ కె వెంకటరావు, మచిలీపట్నం ఇన్చార్జి ఆర్డిఓ పోతురాజు, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్, మచిలీపట్నం తహసిల్దార్ నాగభూషణం అధికారులు పాల్గొన్నారు.





## ఘనంగా చండీహోమం, కోటి కుంకుమ అర్చన రేపేముగింపు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక కాలేఖాన్ పేట, శ్రీ రసలింగేశ్వర స్వామి వారి దేవాలయము నందు, శ్రీ చండీ పూర్వక కోటి కుంకుమార్చన కార్యక్రమం 7వ రోజు శుక్రవారం,అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మచిలీపట్నం పరిసర ప్రాంత గ్రామ ప్రజలు ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ ఈ కార్యక్రమానికి విచ్చేసి, భక్తులను ఉద్దేశించే ప్రసంగిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు తరచుగా జరగాలని, మహిళలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అతి పవిత్రమైన చండీ హోమం కోటికుంకుమార్చన జరగడం నగరానికి మంచిదని బాలాజీ అన్నారు ధనుర్మాసంలో పెద్ద ఎత్తున ఈ పూజా కార్యక్రమాలు జరగటం పాల్గొనడం ఆదర్శప్రాయమని బాలాజీ అన్నారు. హిందువులకు సంక్రాంతి పెద్ద పండుగని సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 150 కేజీల పాదరసంతో ఉన్న ఏకైక శివలింగం మచిలీపట్నంలో ఉండటం ప్రజల అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో, బ్రహ్మశ్రీ జ్యోస్తుల బాలకృష్ణ, పొక్కునూరి హరినాథ్ అవధాని, ఇటికాల చంద్రశేఖర్ లతోపాటు, పోతుకుచి ఆంజనేయ కుమార్, ఆలయ అర్చకులు, బ్రహ్మశ్రీ ఫణి కిరణ్ శర్మగారు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, సిహెచ్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. రసలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ, శ్రీ దత్త సాయి మందిర కమిటీ వారు విశేష సేవలు అందించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు, శ్రీ రసలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవము జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## శ్రీ మేధాలో సంక్రాంతి సంబరాలు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కూచిపూడిలో గల వేదిక్ శ్రీ మేధా పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరానంటాయి. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ కాంపిటీషన్‌లో విజేతలైన త్రిపుర, హాసిని, వర్షిణిలకు బహుమతులు అందించారు. అలాగే చిన్నారులకు భోగిపళ్ళు పోసి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన ఉపాధ్యాయు లకు కూచిపూడి ఎస్.బి. ఐ బ్రాంచ్ మేనేజర్ వి.జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందించిన్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రాధిక సుబ్రహ్మణ్యం తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలి

**ప్రాజెక్టు అధికారి పార్థసారథి**

**మొవ్వ మేజర్ న్యూస్:** ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ప్రాజెక్టు అధికారి కే పార్థసారథి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పద్దారాయుడుతోట గ్రామంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు మినుము, మొక్కజొన్న, పెసలు పంటల యాజమాన్య పద్ధతులపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ప్రాజెక్టు అధికారి పార్థసారథి రైతులకు మొక్కజొన్న, పెసలు,మినుము పంటలలో ఎరువుల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. 30 మంది రైతులకు వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించి, జీవనోపాధి పెంపొందించే అంశాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని, వారికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర అధికారులు డి.డి కె.జ్యోతి రమణి, వ్యవసాయ అధికారి బి.పద్మజ, మొవ్వ మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు నాయక్, ప్రకృతి వ్యవసాయం విభాగ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

# అంబరాన్ని తాకినా.. సంక్రాంతి సంబరాలు..





**నందిగామ, మేజర్ న్యూస్ :** చింతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు సంక్రాతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు ముగ్గులు పోటీలు... గాలి పటాలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు... ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు మాట్లాడుతు ఇది తెలుగు వారు అందరు చేసుకొనే పండగ అని, ముఖ్యంగా ఇది రైతుల పండుగ అని తెలిపారు. బడిలో పండుగ వాతావరణంలో రంగవల్లులు... గొబ్బెమ్మలు.. హరిదాసులు, భోగి మంటలు... గంగిరెద్దులు, పొంగల్లు, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ఉపాధ్యాయ బృందం వెంకట్, సుధారాణి, సురేష్, కిరణ్.. రాజేశ్వరి, జానీ మియా, రాహినా, ప్రవీణ్,లావణ్య, జ్యోతి, వాణి,వినయ్,హేమ సత్యనారాయణ, నాగేశ్వరావు, పాల్గొన్నారు.



## పొలంపల్లి ఆనకట్ట కాలవకు నీరు విడుదల చేయాలి

**పొలంపల్లి ఛైర్మెన్ పొన్నం బాలాజీ**



**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** పొలంపల్లి ఆనకట్ట కాలవకు నీరు విడుదలకు తెలంగాణ రైతులకు కౌలు చెల్లించినప్పటికీ నీటి విడుదలకు అభ్యంతరాలు తెలియజేయగా తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు బట్టీవిక్రమార్కని కలిసి పొలంపల్లి ఛైర్మెన్ పొన్నం బాలాజీ వివరించారు. మంత్రి మల్లు బట్టీవిక్రమార్క మాట్లాడుతూ అక్కడి రైతులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బంది రాకుండా చూస్తానని, మీ పని మీరు చేసుకోండని సానుకూలంగా స్పందించినట్లు పొలంపల్లి ఛైర్మెన్ పొన్నం బాలాజీ తెలియజేశారు.

## ఘనంగా బెనిఫిట్ మెడికల్ బజార్ 3వ వార్షికోత్సవం



**14 నుంచి ఉచిత షుగర్ పరీక్షలు**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** బెనిఫిట్ మెడికల్ బజార్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి తమ వద్ద మందులు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ బజార్ యజమాని తాతా వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. మహా నగరం నుంచి మారుమూల ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందించాలని ఉద్దేశంతో బెనిఫిట్ మెడికల్ పైలెట్స్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వన్ టౌన్ సితార సెంటర్‌లోని బెనిఫిట్ మెడికల్ బజార్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యజమాని తాతా వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వన్ టౌన్, విద్యాధరపురం సితార సెంటర్ కబేలా సెంటర్ ప్రాంతాలలో పేద ప్రజలు అనేకమంది జీవనం సాగిస్తుంటారని అనారోగ్య రీత్యా మందులు అధిక ధరకు కొనుగోలు చేయలేని వేద ప్రజల కోసం బెనిఫిట్ మెడికల్ బజార్ ప్రారంభించినట్లు తెలిపారు. మూడేళ్ల నుంచి ఈ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. తమ సేవల విస్తరణలో భాగంగా బెనిఫిట్ మెడికల్ పైలెట్ అనే ప్రాజెక్టు ప్రారంభించడం జరిగిందన్నారు. మందులు కావలసినవారు తమ వెబ్ సైట్ ద్వారా ఆర్డర్ పెట్టుకుంటే వారికి మందులను అందజేస్తామని వివరించారు. మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తమ వద్ద మందులు కొనుగోలు చేసే వారి అవసరాన్ని బట్టి ఈనెల 14వ తేదీ నుంచి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జనరల్ మెడిసిన్ పై 25% , ఇన్సులిన్ పై 21% ఎవ్వరు ఇవ్వలేని ధరలో జనరిక్ మెడిసిన్స్ అందజేస్తున్నట్లు తెలియజేశారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దివిసీమలో సంక్రాంతి సంబరాలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి దివిసీమలో మూడు రోజుల ముందుగానే వచ్చింది. తెలుగువారి సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన సంక్రాంతి వేడుకలను విద్యార్థిని విద్యార్థులకు పరిచయం చేసే క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలలతో పాటు స్వచ్ఛంద సేవా సంఘాల వారు ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించి సాంప్రదాయ వంటకాలను వేటి తరాలకు రుచి చూపిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులతో భోగిమంటలు వేయించి ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు విద్యానికేతన్ విద్యా సంస్థ చైర్మన్, అశ్వరావు పాలెం సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్ బహుమతులను అందజేశారు.

## సీపీని కలిసిన నూతన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో పోలీస్ సిబ్బందికి కల్పించిన పదోన్నతులలో భాగంగా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఎన్.టి.ఆర్. జిల్లా లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సర్వీసు ప్రాతిపదికన అర్హతను బట్టి ముగ్గురు హెడ్ కానిస్టేబుల్ నుండి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ లు గా పదోన్నతులు కల్పించి బదిలీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో నూతన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు ఎస్.మురళి కృష్ణ, సి.హెచ్. ఉమా మహేశ్వర రావు, ఎం.ఏలేశ్వర మెహర్ బాబు శనివారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి చేతుల మీదుగా నూతన భాధ్యతలు స్వికరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ పదోన్నతులు పొందిన సిబ్బందికి అబినందనలు తెలియజేశారు.

# అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం..



## పారదర్శక పాలనలో ఉద్యోగుల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, జనవరి 9, మేజర్ న్యూస్ :** ప్రజలకు పారదర్శకమైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని.. అంకితభావంతో సేవలందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్‌జీజీవో ఎన్టీఆర్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047తో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్తోందని.. ఈ లక్ష్యాల సాధనలో ఉద్యోగులు కీలక భాగస్వాములు కావాలన్నారు. జీడీడీపీ, తలసరి ఆదాయంలో వృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, పేదరిక నిర్మూలనకు అమలుచేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంలోనూ ఉద్యోగుల సేవలు ప్రధానమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అప్పగించిన విధులను సమర్ధవంతంగా అమలుచేయడంలో ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లా సమగ్రాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తారన్నారు. కీలకమైన ఈ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా ఉండేలా ప్రజలకు సేవలందిస్తామని పేర్కొన్నారు. మెగా ఈవెంట్లను విజయవంతం చేయడంలోనూ జిల్లా కలెక్టర్ వారి సారథ్యంలో సమష్టి కృషితో ముందడుగు వేస్తామని సత్యనారాయణరెడ్డి అన్నారు. కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు వీవీ ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి వి.సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ, వి.నాగార్జున, ఎండీ జానీ పాషా, కె.శివలీల, సీహెచ్ మధుసూధనరావు, సీహెచ్ శ్రీదేవి, నగర శాఖ అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ సీవీఆర్ ప్రసాద్, షేక్ నజీరుద్దీన్, కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, డీఎస్ఎన్ శ్రీనివాస్, బి.విజయశ్రీ, రాంబాబు, ఎస్కే ఖాసిం సాహెబ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# భవానీ ద్వీపంలో సంప్రదాయ కళా వైభవం

## రెండో రోజు ఘనంగా ఆవకాయ్.. సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవం





**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** ఆవకాయ్.. సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవం రెండో రోజు భవానీ ద్వీపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు నగర ప్రజలు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ కళలకు వేదికగా నిలిచిన ఈ కార్యక్రమాలు సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. యువత ప్రదర్శించిన నైపుణ్యం అందరినీ ఆకర్షించింది. అలాగే, ప్రసిద్ధ నగాడా వాయిద్య కళాకారుల ప్రదర్శన ఉర్రూతలూగించి, కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని కళాకారులను అభినందించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా సరదాగా నగాడా వాయిద్యం వాయించి ప్రేక్షకులను అలరించారు. సంప్రదాయ కళల పరిరక్షణలో ఇలాంటి ఉత్సవాల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న అమరావతోత్సవం ప్రజల్లో మంచి స్పందన పొందుతోందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని ఆకర్షణీయమైన కార్యక్రమాలకు ఈ ఉత్సవాలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ ప్రోగ్రామ్



**పెడన,మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన సేవా కార్యక్రమం ల ప్రారంభోత్సవం సందర్భముగా హంగర్ రిలీఫ్ వీక్ కార్యక్రమములో భాగముగా అమ్మ ఫౌండేషన్ లోని వృద్ధులకు ఫుడ్ డొనేషన్ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించడం జరిగిందని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో గల అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లోగల వద్ద మహిళలకు పురుషులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెజవాడ నాగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛంధ సేవా సంస్థ లయన్స్ క్లబ్ ద్వారా పెడన కు సేవ చేయాలనే సదుద్దేశంతో 20 మంది సభ్యులు కలసి లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన పేరుతో ఒక నూతన క్లబ్ ను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగినది అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ద్వారా విద్యా, వైద్య, ఆరోగ్యం,సంక్షేమ విషయాలతోపాటుపర్యావరణ పరిరక్షణ, దేశ భక్తి సంబంధ విషయాలలో సామాజిక సేవా కార్యక్రమాలు అధిక సంఖ్యలో విస్తృతంగా చేపట్టడం జరుగుతుంది తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ప్రారంభ సేవా కార్యక్రమంగా వృద్ధులు,వికలాంగులు, పే దలకు ఉచిత అన్నదాన కార్యక్రమముతో ప్రారంభించు కోవడం జరుగుతుంది అన్నారు. సేవ చేయాలన్న ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు లయన్స్ క్లబ్ లో చేరి లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ద్వారా సేవ చేయవచ్చునని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ వెంకట రావు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనకబడి ఆనారోగ్యంతో బాధ పడుతున్న వారితో పాటు అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి లయన్స్ క్లబ్ తగిన విధముగా సహాయ సహకారములు అందిస్తుంది అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన కోశాధికారి మామిడి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా రంగములో మంచి గుర్తింపు ఉన్న లయన్స్ క్లబ్‌లో ఆర్థిక లావా దేవీలు అన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహించబడతాయి అన్నారు. సమాజానికి సేవా చేయాలనే తలంపు ఉన్న ప్రతి ఒక్కరు లయన్స్ క్లబ్ ద్వారా సేవలు అందించవచ్చు చెప్పారు. అమ్మ ఫుడ్ ఫౌండేషన్ నిర్వాహకులు యర్రా మల్లిఖార్జునరావు, చౌడేశ్వరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన సేవా కార్యక్రమంల ప్రారంభ కార్యక్రమం అమ్మా ఫుడ్ ఫౌండేషన్ లో నిర్వహిస్తున్నదుకు తాము లయన్స్ క్లబ్‌కి ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కాగిత శంకర సాంబశివరావు, క్లబ్ సర్వీస్ చైర్మన్ రాయన రాజ కుమార్, క్లబ్ సేవాదళ్ ( ఎల్ సి ఐ ఎఫ్) కోఆర్డినేటర్ జె వి కోటేశ్వరరావు, క్లబ్ మెంబర్ షిప్ చైర్మన్ పి పైడేశ్వరరావు, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సి హెచ్ శ్రీనివాస గుప్తా, ఆర్ పవన్ కుమార్, సి హెచ్ అప్పారావు,లయన్స్ క్లబ్ సేవాదళ్ సభ్యులు బి వెంకటేశ్వర రావు, జంపాన శ్రీను, ఆకురాతి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## సాంప్రదాయ క్రీడలే ముద్దు..

**విసన్నపేట మేజర్ న్యూస్ :** సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలో కోడి పందాలు, జూద క్రీడలు నిర్వహించకూడదని అధికారులు హెచ్చరించారు, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ కే.లక్ష్మీ కళ్యాణి, ఎస్ఐ జి.రామకృష్ణ, ఎం.పీ.డీ.ఓ చిన్న రాట్నాలు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పేరిట సాంస్కృతిక క్రీడలను మాత్రమే ప్రొచ్ఛహించాలని, కోడి పందాలు, జూద క్రీడలు కాదని వారు పేర్కొన్నారు. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని ఆయా శాకల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## వాహినిలో సంక్రాంతి



**తిరువూరు మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ వాహిని కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళ్ళకళ్ళ లాడింది, ముగ్గుల పోటీలు, పిట్టలదొర, గంగిరెద్దుల ఆటలు, కోలాటం వంటి వివిధ సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్. నాగేంద్ర బాబు, సెక్రటరీ వుటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, డీన్ డా. కె. కిరణ్ కుమార్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడిపందాల నిషేధంపై అవగాహన, గ్రామసభలు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ, యలమర్రు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్(వంశీ) కోడిపందాల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కోడి పందా లు నిర్వహించడం, పాల్గొనడం చట్ట రీత్యా నేరం అని, ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 సెక్షన్ 10, జంతు హింస నివారణ చట్టం 1960 సెక్షన్ 34 ప్రకారం క్రిమినల్ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కోడిపందాలు జరుగుతున్నట్లు ఆచూకి తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కోడిపందాల నిషేధంపై గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, వీఆర్వో ఫణికుమార్, సచివాలయాల సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999